ప్రేమరుచి తెలిసిన స్త్రీ సాహసము

౧

''వదలిపెట్టు నన్ను.''

అతని బాహువ్రులలో ఊపిరి సలుప వీలు లేకుండా పట్టుకోనబడియున్న ఆమె కోపంతో రోజుతూ పలికింది. పెనగులాటలో వస్త్రము తొలగిపోయిన ఆమె ఎదురు రొమ్మువీుద అతడు పెదవు లానింప బోతూంటే విసరి కొట్టింది. చివరకు పట్టువదలించుకుని ఈ వలకు వచ్చి చెరగు సవరించుకొని అతనికేసి వీపు వుంచి నిలబడి 'వట్టిపశువు' అనుకుంది బైటకు వినీవినబడునట్లుగా.

అమనుల్లా నవ్వేడు. బలిష్ఠుడైన యువకుడతడు. అప్పటి యతని శరీరమంతా మోహోద్రేకముతో పొర్లువారుచుండెను. ఎదర నిల్చియున్న ఆసుకుమారిని చూస్తూన్నప్పుడతని నల్లటినేత్రాలు ప్రకాశవంతములయ్యేను.

'ఏమిటి మధూ! సమాచారం? ఈ రోజు నాపట్ల నిరసనభావం చూపిస్తున్నావే!' అన్నాడు. ఔను. ఈవరకెప్పుడూ మధు అతనితో అంత వెగటుగా పెనగులాడి యుండలేదు.

అతని ప్రశ్నకామె సమాధానమే యివ్వలేదు. పూర్తిగా ద్వేషభావము పెరిగిపోయిందామె కతనియెడల. అతనికేసి ముఖమన్నా త్రిప్పలేదు.

తమకము పట్టలేకుండావున్న అమనుల్లా తిన్నగా ఆమె వెనుకగావచ్చి నిల్చున్నాడు. బలయుతములైన తన బాహువులు ఆమె వక్షోభాగము మీుదుగా పోనిచ్చి బిగి కౌగిలిలోకి లాక్కున్నాడామెను. మెల్లగా వంగి ఆమెకంఠం ముద్దుపెట్టుకోభోతూ 'మధూ! ఎందుకింతకోపం?' అన్నాడు.

అప్పుడామె శరీరమంతా కోయ్యబారినట్లైపోయింది. ఎక్కడలేని శౌర్యంవచ్చి యతని బాహువుల పట్టువదలించుకుని కోపంతో కందగడ్డవలెనైన ముఖం చిట్లించుతూ చరచరా నడచిపోయి అక్కడవున్న కుర్చీలో కూర్చున్నది కాలుమీుద కాలు వేసికొని. ప్రక్కనేవున్న 'పేకెట్టు'లోనుంచి ఒక సిగరెట్టుతీసి వెలిగిస్తూ 'అమనుల్లా! నీతో జీవితం నాకు పూర్తిగా విసుగెత్తిపోయింది. ఇక నిన్ను వదలిపోక తప్పదు' అన్నది.

'ఏమిటి ధోరణి, ఇల్లాగు మారిపోయింది; పిచ్చెత్తలేదుకదా!'

'మూడునెలలక్రితం నిన్ను కలసికొన్నప్పుడు, నిన్ను మోహించడానికి నా మనస్సు వొప్పుకున్నప్పుడు నాకు పిచ్చెత్తియుండవచ్చును. ఇప్పుడు చైతన్యదశలోనే వుండి మాట్లాడుతున్నా.'

అమనుల్లాముఖం కొంచెం తెల్లబారింది. సిగరెట్టుపొగ వదలేస్తున్నది మధు.

'అమన్! ఇక నీవు నీదారిని వెళ్లిపో. ఈ మూడునెలల అజ్ఞానం చాలు. ఇంత కాలంగా నేనిదివర కెవరిమీుదనూ ప్రేమనిలిపి యుండలేదు.'

మధు కుర్చీలోనుంచి లేచి అక్కడ బల్లకానుకుని నిల్చుని మళ్ళీ చెప్పింది. 'నే నివ్వాళ రాత్రికే ప్రయాణంకట్టేస్తున్నా. మనం మొదలు కలసికొన్నప్పుడు జీవితాంతంవరకూ ఒకరికొకరు బంధింపబడియుండవలెననే నిష్కర్ష ఏమీులేదు. ఎప్పుడుబడితే అప్పుడు ఒకరినొకరు విడిచిపోవచ్చుకదా!'

అమనుల్లా ఆమెకు దగ్గరసావచ్చి ఆమె

చేయిపట్టుకుని అన్నాడు : 'మధూ! గతమంతా మరచిపోయినట్లున్నావు నీవు. ఆరాత్రి—మీ తండ్రిగారి మేడపై భాగంలోవున్న నీకోసరం గోడ కెగబ్రాకి వచ్చిన యారాత్రి మరచిపొయ్యావనుకుంటాను. ఉచ్చుత్రాళ్ళవంటి నీచూపుల్లో, నీ పెదవులమీది ప్రేమోద్రేకంలో, నీ సౌందర్యములోని మాధుర్యములో కరగిపొయ్యాను. పిచ్చిప్రేమతో నిన్ను అంటుకుని వున్నాను. నీవుకూడా నాతో ఇక్కడకు వచ్చేశావు, అప్పటికి నీకువున్న కొందరు ప్రియులను వదలేసి. ఆప్రక్కగదిలో ఆనాడు నాకౌగిలిలో కరగిపోయి నీవు 'అమన్, నిన్ను నేనెంతగా ప్రేమిస్తున్నాను!' అన్నావు జ్ఞాపకముందా?'

'అంటే అనివుండొచ్చు. అప్పటిది ఒక ఉన్నతదశ. అంటేయేం?'

'అంటేయేమా?' అత డామెచేయిని మరింత గట్టిగా నొక్కేడు కోపంతో. 'మధూ! నీకు ప్రేమంటే తెలిసిరాలేదు. ఈ అమనుల్లాను ఒకసారి ప్రేమించి నీ యిష్టంవచ్చినప్పుడు త్రోసేసి వెళ్ళిపోవచ్చుననుకున్నావు కాబోలు! విను. నిన్ను నేను కదలనివ్వను. నేను నిన్ను ప్రేమిస్తున్నాను, ఇప్పటికీ నా ప్రేమ చలించలేదు. నిన్ను విడిచిపెట్టలేను. విడువను. పురుషునికి స్త్రీయెడల యుండే కోరికకంటే నాప్రేమ ఉత్కృష్టమైనదని నీకవగతము కాలేదూ? నిన్ను పూజిస్తాను. నీవు నాలో భాగమయ్యావు. నీవులేక నా జీవితం శూన్యం. నిన్నెప్పుడూ నాదగ్గరే వుంచుకుంటాను ఇల్లాగా' అంటూ ఆమెను మళ్ళీ గుండెల కదుముకున్నాడు.

మధు తన చేయెత్తి అతని పెదవులకూ తన నోటికీ మధ్య పెట్టేసింది ముద్దు పెట్టుకోనివ్వకుండా.

అమనుల్లా చెప్పినమాటలన్నీ అతని ఆత్మ బహిర్గతమైనవనీ, అసత్యదూరమైనవనీ ఆమెకు తెలుసు. అత డామె సౌందర్యానికి విపరీతంగా, గుడ్డిగా అంటుకుపొయ్యాడు. కాని అమనుల్లాకూ, అతని ఉద్రేకానికీ, లొంగిపోవడం, ఆమెకు, తన ఆత్మస్వాతంత్ర్యాన్ని పోగొట్టుకోవడం కంటే నీచంగా తోచింది. అతనిమోహం తన ఆత్మగౌరవాన్నీ జీవితాశనూ గూడా త్రెంచివేసేదని అనుకుంది. అమనుల్లా నవయువకుడే; సౌందర్యవంతుడే; కాని అడవిజాతి, ఆకర్షణీయమైన అతని హావభావములలో పులియొక్క వికటాట్టహాసం మరుగుపడివుంది. కనుక అట్టి అతన్ని అనుసరించి చివరకు పాతాళగహ్వరాల్లోపడే ముందుగానే తన్నుతా రక్షించుకోదలచింది మధు. అందుచేత మళ్ళీ అతనితో మృదువుగా అంది : 'అమన్, నిన్ను మోసగించడం నాకు విచారంగానేవుంది; కాని నేను నిశ్చయించుకున్నాను. ఇదే ఆఖరురోజు. నేటితో మన సంబంధం అంతరించిపోవాలి.'

'ఆ! నీ నిశ్చయ మైపోయిందా? నీ స్వార్థమునకూ, నీ చలచిత్తమునకూ తగినట్లు నన్నుపయోగించుకొనుటకు నీ సేవకుణ్ణనుకున్నావా?'

మధు ఒక వెనుకడుగు వేసింది. అమనుల్లా స్థిరంగా ఆమెముందు నిలబడి అన్నాడు 'నీవు నాకు చెందినదానివి; సృష్టి అంతా యేకమై కూడా నిన్ను నావద్దనుంచి తీసికొనిపోజాలదు. నిన్నువలె నే నేస్త్రీనీ ప్రేమించి యుండలేదు. వెళ్ళితేవెళ్ళు. వెళ్ళినా మళ్ళీతిరిగివస్తావు నీవే.'

'ఈసారి రాను'

'అల్లాగా!' అమనుల్లా ఆమెభుజముమీద చేయివేసి 'సరే, నీవు పోబొయ్యే ముందు నా నిశ్చయంకూడా విను. నేను చచ్చిపోయి

తర్వాతనే నిన్ను వదలుకోవడం' అంటూ ఆమె భుజముమీద అయిదుగోళ్లూ నొక్కేడు. కొంచెంగా నెత్తురు గ్రక్కుతూన్న ఆగుర్తులు చూపిస్తూ అన్నాడు: 'చూచుకో, నీవు నా ఆస్తివి అని నిరూపించడానికి గుర్తులు. అవి [illegible]కాలం బాధకలిగించవు; కాని నీ శరీరంమీద అవి శాశ్వతంగా నిల్చియుంటవి నన్ను జ్ఞాపకంచేస్తూ.'

అమనుల్లా గుమ్మందాటి వెళ్లిపొయ్యాడు. భుజముమీద ఆ అయిదు నఖక్షతాలూ చూసుకున్నప్పుడామె కామహమ్మదీయయువకునియెడల కలిగిన నిరసనభావం శాశ్వతమైంది. భరింపరానికోపంచేత కళ్లమ్మట నీళ్లు కూడా వచ్చినై.

౨

గంగాధరనాయుడికి వయఃకాలంలో భార్యపోయింది; వెంటనే మళ్ళీ రెండోపెండ్లి చేసుకున్నాడు. కాని డబ్బుమీది ప్రేమచేత ఎప్పుడూ పుగాకువర్తకంలో మునిగి తేలుతూండేవాడు నాయుడు; ఆపడుచుభార్య ప్రేమదాహం తీరక కృశించుతూండేది.

మధును ప్రసవించిన కొన్నాళ్ళకు నాయుడుభార్య అతన్ని వదలేసి ఎవరితోనో లేచిపోయింది. నాటనుంచీ జీవితమంటే అసహ్యం పెరిగిపోయిన గంగాధరనాయుడు కూతురును పెంచేవిషయంలో తగు శ్రద్ధ తీసికోలేదు.

మధు తల్లిపోలిక; తల్లికంటే కూడా అందంగా వుంటుంది. అప్పుడప్పుడామెను గురించి నాయుడంటుండేవాడు: 'ఈపిల్లమాత్రం ఆ తల్లికూతురుకాదా; ఇదికూడా వంశమర్యాదకు వేరుపురుగువంటిదే' అని.

ఆయన అన్నట్లే అయింది; అందుకామన అజాగ్రత్తకూడా కొంతవరకు సహాయమైంది. వయసువచ్చిన కొద్దీ మధుకు కామేచ్ఛ వృద్ధిపొందుతూ వచ్చింది. మనస్సంయమము లేని యూపడుచు తనకోరిక ఎట్లాపోతే అట్లా ప్రవర్తించింది. చివరకామె సౌందర్యం పొగిడే వాళ్లు చాలామంది పోగయ్యారు. ఒకరి తరువాత ఒకరు—ఎవరూ ఆమెను పూర్తిగా గ్రహింపలేక పొయ్యారు. వాళ్ళందరిలో అమనుల్లా భయంకరుడుగా కనుపించాడామెకు. మొదలామె అతనివలలోచిక్కుకుని, తండ్రినివిడిచి హైదరాబాదుపోయింది. ఇప్పుడు మళ్ళీ విసుగెత్తి తండ్రిదగ్గరకు పోనున్నది. అయితే ఆయన ఆమెను క్షమించి పరిగ్రహిస్తాడా?

మూటా, ముల్లె సర్దుకుని తెల్లవారుఝామున బయలుదేరే రైలుకుపోయింది. అమనుల్లా తన్ను వెంబడించి వస్తున్నాడేమోనని క్షణక్షణమూ ఆమె గుండెలు కొట్టుకుంటున్నవి. తడవతడవకూ వెనుదిరిగి చూచుకుంటుంది.

రైలుబండి కదిలేవరకూ ఆమెమనస్సు మనస్సులోలేదు. కూతవేసి బండీ కదిలిన కొంతసేపటికి కుదుటబడ్డ మనస్సుతో తాను కూర్చున్న డబ్బాలో కలయజూచింది. తన ముందు బల్లమీదనే కూర్చున్న ఒక యువకుణ్ణిచూచినప్పుడు మధు మనస్సులో నూతనాలోచనలు రేగెను. ఇద్దరిచూపులూ కలసినప్పుడు చిరునవ్వులు కూడా అందించుకున్నారు.

తినుటకు ఆహారమూ, ధరించుటకు దుస్తులూవలె మధుకు మగవాళ్లూ అంత అవసరమయ్యారు. ఉన్నవయసుకంటే చిన్నవాడనుకోదగిన ఆయువకుని ముఖంలో తేజస్సువుంది. అతన్ని తనమనస్సులో చిక్కించుకుని అమనుల్లాను మరచిపోడానికి అవకాశం దొరికింది కదా అని సంతోషించింది. అతన్ని ఒక్క—

సారిగా ఆకర్షింపజాలినంత చిరునవ్వు పెదవులమీదనిల్పి కడగంటి చూపులు చలింపజేస్తూ ! 'మీరెంతవరకు వెళ్లుతారో అడుగవచ్చునా' అంది.

'గుంటూరు' అన్నాడు. కాని ఆకురుచ జవాబుతో ఊరుకోకుండా సంభాషణ పెంచాలనే వుద్దేశంచేత స్వవిషయం చాలావరకు ఎరుకపరచాడు. గుంటూరుకు ముప్పది మైళ్ల దూరంలో వున్న ఇందిరాపురం అతనినివాసం. కొన్ని పనులమీద హైదరాబాదు వచ్చి మళ్లీ యింటికి పోతున్నాడు.

మధు అన్నది : 'నేనూ గుంటూరు పోతున్నాను. ఒంటరిగా ఉండకుండ మీస్నేహం దొరికినందుకు సంతోషంగావుంది. మీ పేర డుగవచ్చునా ?'

'ప్రకాశం—మీ పేరు ?'

'మధు.'

3

ఇద్దరూ వరంగల్‌లో దిగేరు. ప్రకాశానికి ఒక చక్కని యిల్లువుంది అవూళ్లో. అతని తాతగారి దాయిల్లు పూర్వం. ఆయన చనిపోతూ దాన్ని ప్రకాశంతల్లిపేర వ్రాశాడు. పొరుగూరునుంచి వచ్చే వుద్యోగస్థు లెవరైనా ఆయింట్లో అద్దెకు వుంటూంటారు.

నాలుగు నెలలనుంచీ ఆయిల్లు ఖాళీగా వుంది. దాన్ని ఎవరికన్నా అద్దెకిచ్చే యేర్పాట్లుచేసిపోదామని ప్రకాశం వరంగల్‌లో నాలుగైదు రోజులు నిల్చిపోదామనుకున్నాడు. మధునుకూడా తనయింటికి తీసికెళ్లేడు. ఆమె అభ్యంతరం పెట్టలేదు.

మధుకు ఇదివరకు చాలామంది మగవాళ్లతో పరిచయం కలిగింది. వాళ్ళందరిముఖాల్లో ఆమెకు కనుపించిన నైచ్యభావం ప్రకాశంలో లేదు. అతని కన్నుల్లో తన్ను గానం చేస్తున్న కవిహృదయంవుంది. బహుసుతిమెత్తన మనస్సుకలవాడు. ఆమెను మళ్ళీ పశ్చాత్తాపానికి లోనుచేసేట్లు అతడు ప్రవర్తించనే లేదు. అందుచేత మధు అతనికి మరీ మరీ లొంగిపోయింది. మగవాడంటే ఈవరకెప్పుడూ కలగని సిగ్గు ప్రకాశంముందర అనుభవిస్తున్నది.

ప్రకాశాన్నిగురించి యామెకు ఎక్కువగా తెలిసినకొద్దీ అతనిపై ప్రేమ అభివృద్ధిచెందసాగింది. ఎల్లకాలమూ అతనితో సంభాషిస్తూండటమే పరమావధిగా వుందామెకు. అతనిసాంగత్య మామెమీద మంత్రమువలె పనిచేసింది. ఆమె చెక్కులకు లేతగులాబీ వన్నె వచ్చింది ; ఒకనూత్న తేజస్సు కన్నులలో ప్రకాశించింది.

అన్ని విషయాల్లో ప్రకాశ మామెకు ఆనందమే చేకూర్చాడు. కాని మధును ఒక్క విషయం కలతపెట్టసాగింది. వరంగల్‌లో వాళ్లు ఏకాంతంగా వుంటూ నాలుగురోజులైంది; ఒక్కసారైనా అత డామెను ముద్దుపెట్టుకోలేదు. అట్టి యొంటరిపాటు దొరికినప్పుడా కుర్రవా డంతమాత్రం సాహసించకూడదూ!

మధు ఒక్కొక్కసారి అనుకుండేది. 'అతడు నన్ను ప్రేమిస్తున్నాడనటములో అబద్ధం లేదు. అతని చూపులూ, మాటలూ అట్లే మొగ్గివున్నవి. కాని నానిజమైన చరిత్ర తెలిస్తే నన్నీవిధంగా ఆదరిస్తాడా—అయినా, నన్ను ప్రేమించినవాడు క్షమించజాలనంత తప్పు చేసియున్నానా ?'

ఆపూట మధుకు ఎంతో వుత్సాహంగా వుండెను. అన్ని ఆనందవాహినులు ఆమెలో ప్రవహించడ మదే మొదటిసారి. ఆ సాయంత్రమంతా నిలువుటద్దంముందు అలంకరించుకుంటూనే వుంది.

హోటలునుంచి తెచ్చుకున్న భోజనం తినేసి ఇద్దరూ డాబామీది కెళ్లేరు చల్లగాలికి. అప్పటికి రాత్రి పదిగంటలౌతుంది. ప్రకాశంలో యావనరక్తం కొంచెంగా కదిలింది. ఆనిండు వెన్నెట్లో మధు ఎంత చక్కనిదిగా ఉంది!

'మధూ! చూడు ఈపండువెన్నెల ఎల్లాగు దేశమంతా వ్యాపించుకుందో. చంద్రబింబమింత ప్రకాశవంతంగా నే నెన్నడూ చూచియుండలేదు. అతిమధురంగావున్న యీశర్వరీగర్భంలోనుంచి సౌందర్యం మనహృదయాల్లోకి కూడా ప్రవహిస్తున్నది.'

'ఔను. ఈరాత్రి మనం మరచిపోదగిందిగా లేదు.'

'ఈసుధాప్రవాహంలో మధూ, నీవు దేవతవలె ఉన్నావు. నిజంగా మంచి అందగత్తెవు.'

'నీవు బాగాపొగడగలవు' అంటూ సిగ్గుచేత ముఖం వంచుకుంది.

ఔచిత్యరహితంగాని తమకంతో రెండడుగులు ముందుకేసి ప్రకాశం ఆమెచేయి గ్రహించి 'మధూ, పొగడ్తకాదు. నీ సౌందర్యం నన్ను పూర్తిగా ఆకర్షించుకుంది. హైదరాబాదు స్టేషనులో మనం కలసికొన్నప్పటినుంచీ నాలోనుంచి ప్రేమప్రవాహం నీకేసి అంతులేకుండా ప్రవహిస్తూనేవుంది. మనం వివాహంచేసుకుందాం; నీ యంగీకారమే తరువాయి.'

'ప్రకాశ్! మన యీకాస్తపరిచయమూ వివాహమువరకూ లాక్కెళ్తున్నావు. నన్ను గురించి నీకేమీ తెలీదు.'

'నాకోసరమని సృష్టింపబడ్డ అందగత్తెవని మాత్ర మెరుగుదును.'

కల్మషంలేని తన మనస్సునే వాచా పలికించాడు ప్రకాశం. అట్టి నిష్కపటిముందర నిజందాచలేకపోయింది మధు.

'నన్నుగూర్చి నీవు తెలిసికోవలసిన దానిలో సగభాగమైనా నీవెరిగియున్న యెడల అసహ్యపడతావు నామీద. మరోసారి నన్ను చూడ్డానికైనా కోరవు.'

ఆ మాటలతో ప్రకాశం నిర్ఘాంతపడవలసింది. కాని అతని కన్నుల్లోని ప్రేమజ్యోతి చలించలేదు. అతని చేతులు ముందుకు చాచుకుని ఆమెను హృదయందగ్గరకు తెచ్చెను.

'మధూ! గడచిపోయినది నా కక్కరలేదు. నేను ప్రేమించడం వెనుకటి నిన్ను కాదు; ఈరాత్రి, ఈవెన్నెట్లో అమర్త్యసౌందర్యాన్ని చిమ్మేస్తున్న నిన్ను. నీవు నాకు కావాలి; నాహృదయం నిన్నెప్పుడూ తనలో ఇముడ్చుకోటానికి కోరుతున్నది. రా; నా అర్థాంగివై పో.'

మంత్రములవలెయున్న వతని మాటల అతని హృదయం ఇమిడివుంది వాటిల్లో. కపటంలేని అట్టి ప్రేమసందేశం మధు ఎప్పుడూ వినియుండలేదు. ఆమె తలెత్తి ప్రకాశం ముఖంలోకి చూచినప్పుడు అతనికి ప్రేమఅంటే ఎంత అర్థంవున్నదో తెలుసుకున్నది. ఒకనిముషంసేపు అతని మాటల్లోని సంగీతం తన ఆత్మను నింపేసింది. అప్పుడామె సర్వస్వమూ ప్రకాశంలోకి కరగిపోయినట్లైంది.

ఆమె కన్నుల్లోనుంచి అశ్రువులు కారుతూండగా అన్నది. 'ప్రకాశ్, నేను నీతో ఇలా ఎందుకువచ్చానో ఎరుగుదువా? నాకసహ్యము కలిగించిన ఒకనిబారినుండి తప్పించుకుని వచ్చాను. వద్దు. నీవు నన్ను ప్రేమించవద్దు. నాజీవితం నాకే సిగ్గుగలిగించుతున్నది.'

దానికామెను మరింత దగ్గరకు లాక్కోవడమే ప్రకాశం చెప్పిన జవాబు. ఆమె కన్నులలోనుంచి యశ్రువులు పొర్లిపోతున్నవి చె

క్కలమీదుగా.

'ప్రకాశ్! ప్రేమిస్తూన్న నిన్ను నేను నా బుద్ధిపూర్వకముగా దుఃఖం పాల్జేయజాలను.'

'మధూ! సంతోషమైంది నాకు. నీవు నన్ను ప్రేమిస్తున్నావు; అదే నాకు కావలిసింది. గతమంతా మరచిపోయి సుఖంగా వుందాం' అంటూ తనవ్రేలి యుంగరంతీసి ఆమె వ్రేలికితొడిగేసి 'చూడు ఇది నీకు సరిగ్గా సరిపోయింది. దీన్ని నాప్రేమచిహ్నంగా వుంచుకో' అన్నాడు.

మధు ఏమీమాట్లాడలేక పోయింది. ప్రకాశంయొక్క ఔదార్యమూ, ప్రేమ, తన్ను ముంచేసినవి. 'ఈపుణ్యమూర్తికి కష్టంకలిగించేలాగున, భగవంతుడా, నన్నెప్పుడూ ప్రవర్తించనీకు' అని ప్రార్థించి ఎందుకో ఉబికిపోతూన్న హృదయంతో అతని వక్షస్థలంలో శరణ్యం పొందింది.

౪

సాయంత్రం నాలుగుగంటలకు గుంటూరులో రైలుదిగి మధు తన తండ్రిగారింటికి బయలుదేరింది. ప్రకాశమేమో 'వెల్కం' హోటలుకు పోయాడు. రాత్రి పదిగంటలవరకూ అతడక్కడే వుంటాడు. ఆలోపుగా మధువచ్చి అతన్ని కలుసుకోవాలి. కలుసుకుంటే ఇద్దరూ కలిసి ఒక 'స్పెషల్ కారు'లో ఇందిరాపురం పోతారు. అదీవాళ్ళ 'ప్లాన్.'

గంగాధరనాయుడు పుగాకువర్తకంలో సంపాదించిన డబ్బుతో గుంటూరులో నాలుగైదు ఇండ్లు కట్టించాడు. ఆయన కొత్తపేటలో ఉన్న యింట్లో వుంటాడు. తిలక్ పేటలోవున్న యిల్లు మధుస్వాధీనంలోవున్నది. మిగిలినవి అద్దెకివ్వబడ్డాయి.

ఇప్పుడు తిలక్ పేటలో యింటికి వెళ్ళింది మధు. తనసామానంతా అక్కడ సర్దుకుని, తరువాత తండ్రిగారినిచూచి, ఆపైని ప్రకాశాన్నికలసి వెళ్ళిపోవాలని ఆమె కార్యక్రమం.

ఇంటికిపోయి తలుపులన్నీ తీసివుండడము చూచినప్పుడామెకు ఆశ్చర్యమూ, భయమూ కలిగినవి. తనసంచిలో చూచుకుంటే ఆ యింటి తాళపుచేతులు లేనేలేవు. ఎవరైనా దొంగిలించి ఆ యింట్లో ప్రవేశింపలేదుగదా!

హాల్లోకి చేరుకునేసరికి చాచిన చేతులతో అమనుల్లా వచ్చి ఆమెను గట్టిగా కౌగిలిలో నలిమేశాడు. అనేకసార్లు అతని పెదవులు ఆమెనోటికి కరుచుకుని పోయెను. చివరకు బాహువులు సళ్ళించి అన్నాడు : 'మధూ! ఆశ్చర్యంగా ఉండొచ్చునీకు; నీసంచిలోనుంచి తాళపుచేతులు హైదరాబాదులోనే దొంగిలించేశాను.' అతని అరచేతిలోవున్న తాళపుచెవులు తీసికొన్నది మధు. అమనుల్లా మళ్ళీ అన్నాడు : 'మధూ! నీప్రేమభిక్షువు వచ్చినందుకు నీవు సంతోషపడుతున్నట్లు లేదే!'

'అయితే, ఈ దొంగపనీ, ఇలా సాహసించడం తగునా ?'

'నీవు నాసొత్తువైనప్పుడు ఏమిచేయడానికైనా హక్కుందినాకు. రా. ఇలాకూర్చుని ప్రయాణపుబడలిక తీర్చుకుందువుగాని. కాఫీయేమైనా తెప్పించనా?' అంటూ ఆమెచేయి అందుకోబోయినాడు.

ఆచేతివ్రేలికే ప్రకాశం తొడిగిన వుంగరం ఉన్నది. అది అమనుల్లా చూడకూడదు.

—పురాణం కుమారరాఘవశాస్త్రి, బి.ఏ.

ఈస్థితిలో మధు ఏమిచేసినది ? ఆఉంగరమును అమనుల్లా గాంచినాడా? ఆమె అతన్ని వదిలించుకోకలిగిందా ? ప్రకాశ్‌ను పెండ్లాడి సుఖపడిందా లేక అమానుల్లా ఏమైన అడ్డుతగిలాడా ? పై మాసపు సంచికలో చదువగలరు.

ప్రేమరుచి తెలిసిన స్త్రీ సాహసము

రచయిత:
పురాణం కుమారరాఘవశాస్త్రి, బి. ఏ.

[గత సంచిక తరువాయి.]

అతి జాగ్రత్తగా ఆవ్రంగరాన్ని తీసి జాకెట్టులోపలవున్న బాడీలోకి జొనిపి హృదయం దగ్గరకు చేర్చింది. అమనుల్లా అది కనిపెట్ట లేదు.

ఆరుగంటలౌతుంది అప్పటికి. పదింటికల్లా ప్రకాశాన్ని కలుసుకోవాలి పోయి. ఈ నాలుగుగంటలకాలంలో ఎల్లాగైనా అమనుల్లాను వదలించుకునే ఉపాయంచూడాలి. కోపపడితే లాభంవుండదు. తిన్నగా ప్రేమనటించి అతన్ని మైమరపించి వెళ్ళిపోవాలి. అందుకోసం నాటకం ఆరంభించింది; కాస్సేపు అక్కడ నిలువుటద్దంముందు ముంగురులు సవరించుకుని చిరునవ్వుతో అతనిదగ్గరకువచ్చి అతని నిర్దయాశ్లేషములో అసహ్యం చూపకుండా అన్నది: 'అమన్! నీవు వింతమానిసివి సుమా. మళ్ళీ ఇలావస్తావనుకోలేదు నేను. ఇప్పటి నా ఆనందం తెలుసుకోలేకుండా వున్నాను.'

ఆమాటలతో చాలవరకు నిద్రవచ్చింది అమనుల్లాకు. 'హైదరాబాదులో నీ ప్రవర్తనబట్టి నీయెడల నా కనుమానంగానే వుందిసుమా, మధూ!' అన్నాడు.

'అమన్! అది నీస్వభావం; అంతేగాని నిన్ను నేను మరువగలనా.' అంటూ అతని చెంపకానించింది తన చెక్కిలి.

తరువాత మధు తన దుస్తులు మార్చుకుని పక్కా మొగల్ ఫేషన్‌లో గై చేసుకుంది. రెచ్చిపోయిన కామోద్రేకంతో అమనుల్లా ఆమెను మళ్ళీ సందిట పట్టుకున్నాడు.

ఆముద్దులూ, ఆనొక్కటాలూ అన్నీ ప్రకాశంమీది ప్రేమచేత సహించింది మధు. ఆమె హృదయంలోమాత్ర మా మహమ్మదీయుని యెడల ద్వేషం, కోపం అన్నీ ద్విగుణీకృతమౌతున్నవి.

'అమన్! ఈదుస్తులు నీకోసమే ధరించాను' ఆమె వయ్యారం చిలికింది.

'సెబాస్, మధూ! నీవు నారాణివి.'

'అమన్, నేనిప్పుడే కొత్తపేటలోవున్న మానాన్నదగ్గరకు వెళ్ళి పదిగంటలకు సరిగ్గా తిరిగి వస్తాను. తరువాత మనము సినీమాకు వెళ్ళి వచ్చి ఇక్కడే యీరాత్రి గడుపుదాం. ఎవరూ వుండరిక్కడ; మనమిద్దరమే. వెళ్ళిరానా? మరోసారి ముద్దుపెట్టుకో నన్ను.'

౫

కొత్తపేటలో తండ్రిగారింటి ముందు బండిదిగి లోపలికెళ్ళింది మధు. గంగాధరనాయుడు తనగదిలో ఒక కుర్చీలోకూర్చుని యున్నాడు. కూతురునుచూచినప్పు డతని కన్నులలో నేవిధమైన ప్రేమా తొణుకాడలేదు. తన జీవితమాధుర్యం దొంగిలించి లేచిపోయిన ఆ నిర్భాగ్యురాలి (తనభార్య) ప్రతిబింబమును వలె ఆమెను చూచాడు.

మధుమాత్రం ప్రేమతో, గౌరవభావం చూపుతూ తండ్రిని పలుకరించింది. అయన కుశలప్రశ్నలడిగి ఆమె వుత్సాహాన్ని తెగ గొట్టేశాడు. చివర కామె ప్రకాశం గుణగ ణాలు వర్ణించి, తా నతన్ని పెండ్లి చేసికో బోతున్నాననీ, అతని తల్లిని చూడ్డానికి ఇం దిరాపురం పోతున్నాననీ చెప్పినప్పు డాయన కొంచెం కదిలేడు.

'నిజమేనా ? నేను నమ్మవచ్చునా ?' అ న్నాడు.

'పూర్తిగా నమ్మచ్చు. ప్రకాశం చాల మంచివాడు. నేనతన్ని వివాహమాడుతాను. నేనిన్నాళ్ళనుంచీ కోరుతూన్న జీవితసౌఖ్యం దొరికింది—మీరు నన్నీవిధంగా చిన్నప్పటి నుంచీ ఉపేక్ష సేయకుండా వుంటే—'

'గంగాధరనాయుడు తల కొద్దిగా ఊపేడు. 'సరే, మధూ! నీవు ఆతల్లి కూతురువనే సంగతి నేను మరచిపోయేటట్లు ప్రవర్తించు. సంతోషిస్తాను. నీకు కావలసిన డబ్బు తీసి కొని వెళ్లు.' అన్నాడు.

తరువాత పదినిముషాలకు మధు 'వెల్‌కం హోటలు'లో ప్రకాశం కౌగిలిలో యిముడి వుంది. ఇంకో పదినిముషాలకు గుంటూరు పొ లిమేర దాటిపోయా రిద్దరూ.

పదకొండుగంటలవరకూ అమనుల్లా మధు కోసం చూచి, చూచి, ఎంతవరకూ రాక పోవడంచేత ఆమె తన్ను మోసగించిందని తెలిసికొని వుంటాడు.

౬

వారంరోజుల తరువాత :

ఇందిరాపురంలో ప్రకాశం నివసించే యి ల్లు చాల అందంగా ఉంటుంది. మధు ఆనా గదయం తనకోసమని ప్రత్యేకింపబడిన గది లో 'టేబిల్' ముందు కూర్చుని ఒక యుత్త రం వ్రాస్తున్నది. అప్పుడప్పుడు తలెత్తి అక్కడ కిటికీలోనుంచి చూచినప్పుడు పచ్చని పొలాలూ, మరీ దూరానవున్న కొండలూ, ఆమెకు కనుపించుతవి.

ఉత్తరం వ్రాయడం ముగించి, ఒకసారి సాంతంగా చదివింది.

"ప్రియమైన తండ్రిగారికి—నాకిక్కడ ల భ్యమైన సౌఖ్యమూ, ఆనందమూ మీకు తె లియజేయడమే ఈవుత్తరముయొక్క ఉద్దే శము. ప్రకాశమూ, పండు ముసలిదైన అతని తల్లీ నాపట్ల మిక్కిలి అపేక్షతో వు న్నారు. నేను వారింట అడుగుపెట్టిన రోజు ఆ ముసలితల్లి నన్ను కౌగలించుకుని 'అమ్మా నిన్ను నా కొడుకునువలెనే ప్రేమిస్తున్నాను' అన్నప్పుడు నాకామెయెడల పూజ్యభావం కలిగింది.

ప్రకాశం చదువుకున్నవాడనీ, మంచి వుపకారియనీ, మీదు మిక్కిలి ధనవంతుడనీ మంచి పలుకుబడివుంది గ్రామంలో. ఇచ్చటి భూములన్నీ చాలమట్టుకు అతనివే. దేశము తిరిగియున్నవాడవడముచేత క్రొత్తపద్ధతుల మీద స్వంతముగానే వ్యవసాయము సాగించ వలెనని అతని అభిలాష. అతన్ని పెండ్లాడి, అతని జీవితభారం పంచుకోవడం నేను కోర తగిందిగా వున్నది.

వచ్చే లక్ష్మివారంనాడే మావివాహం. అంటే సరిగ్గా నేటికి వారంరోజులున్నది. మీ రు తప్పక ఆనాటికి రావాలి ; లేకపోతే నా సంతోషమునకు కొరతకలిగిందన్నమాట. నా యెడల మీకుగల పూర్వపు నిరసనభావం పురస్కరించుకుని, నాకోరిక వమ్ముచేయవద్దు. మీరు నమ్మండి; మూడునెలల క్రితం మిమ్మ

ల్నీ వదలి లేచిపోయిన ఆ మధు చచ్చిపో యింది. ఇప్పుడు నేను కొత్తమధును. ప్రేమ నన్ను పూర్తిగా మార్చివేసింది.

ఇక విరమిస్తాను. మీరు తప్పక రావాలి నాప్రార్థన మన్నింతురని నమ్ముతున్నాను.

మీ ప్రియమైన కూతురు,
మధు.''

ఉత్తరం మడిచి కవరులోపెట్టి చిరునా మా వ్రాసి 'పోస్టాఫీసు'కు పంపించేసింది. అప్పటికి ఉదయం ఎనిమిదిగంటలుకూడా కా దు. గతరాత్రి వర్షముకురిసి యుండుటచేతా, ఇంకా ఆకాశాన మబ్బులావరించుకుని యుం డుటచేతా సూర్యుడెక్కడా కనుపించడం లేదు. చల్లగావుంది. అందుకని యొకసారి తమ పొలాలకేసి వెళ్ళి చూచి వద్దామనుకు న్నారు మధూ, ప్రకాశం. కనుకనే ఉత్తరం ముగించి దుస్తులు మార్చుకుని ప్రకాశం గది లోకి పోయింది మధు.

కాని తలవని తలంపుగా ప్రకాశం వేరే పనిమీద మరోచోటికి పోవలసి వచ్చింది. జబ్బుగావున్న స్నేహితుడొకడు తన్ను చూచి పొమ్మని కబురంపేడు.

'మధూ! నీవొక్కదానివే వెళ్ళిచూచిరా. మన ఒంటెద్దుబండి రామస్వామి తోలు తాడు. ఒకగంటలో వచ్చి అక్కడ నిన్ను కలుసుకుంటాను' అని చెప్పి తాను వెళ్ళిపో య్యాడు.

రోడ్డుప్రక్కన బండీ ఆపి ఒక చెట్టుక్రింద చుట్టకాల్చుకుంటూ కూర్చున్నాడు రామ స్వామి. మధు ఉత్సాహంతో, పొలాల్లోకి ఒంటరిగానే పోయింది. కంటికి కింపుగొల్పు తూన్న ఆపచ్చటిచేలూ, అందు వీస్తున్న చల్లనిగాలీ, ఎంత ఆనందమును గొల్పుతు న్నవి. 'ఈభూములన్నీ నావికదా!' అనుకున్న ప్పు డామె హృదయం ఎంతగా పొంగిపో యింది !

అప్పు డాప్రశాంతనిశ్శబ్దంలో అతిక్రూ రముగనున్న ఆవెడగునవ్వు ఎక్కడిది ! మను ష్యమాంస మారగించి రాక్షసుడుచేయు విజ యసూచకధ్వానమా? అదరిపడి వెనుకకు తిరిగి చూచింది మధు. సంతోషముతో అమ నుల్లాయే వస్తున్నాడామెవైపు. మధు నిశ్చే ష్టురాలై నిల్చుంది. ఈ దుర్మార్గుని బారి నుండి తప్పించుకునే వుపాయమే లేనట్లున్న దే.

'మధూ! నన్ను మోసగించడ మొక తేలిక పననుకున్నావు కాబోలు నీవు. నాకెంత దూరముగా పోతూంటావో నేను నీ కంత దగ్గరౌతుంటాను. తెలిసిందా?' అని సగర్వం గా పలుకుతూ చేరువకు వచ్చాడు.

మధుకు మాటరాలేదు. అమనుల్లా అ న్నాడు : 'మీ తండ్రిగారి వద్దనుంచి నీ అ డ్రస్ తెలుసుకోవడము నాకంత కష్టమను పించలేదు. నిన్నుగురించి నొక అబద్ధపుకథ ఆయనకు చెప్పి నమ్మించాను. దానితో ఆయ నకు నీయెడల అసహ్యంకలిగి నాద్వారా నీ కొక సందేశం పంపేడు. ఇకనెప్పుడూ ఆయ నకు నీముఖంచూపవద్దని శాసించాడు. ఆయన సంరక్షణ వుండదిక నీకు. నాతో వచ్చేయ వలసిందే. ప్రకాశాన్ని పెండ్లిచేసుకోవడ మ నేది నాప్రాణముండగా జరుగదు.'

'నీ వతినీచముగా ప్రవర్తించ గలవు. నిన్ను చూస్తున్నకొలదీ నాకసహ్యం కలుగు తూన్నది. తక్షణమే ఇక్కడనుంచివెళ్ళిపో.' అని ఆమె అన్నది.

మళ్ళీ ఒక వికటహాసంచేశాడు అమను ల్లా ఆమె నడుముచుట్టూ చెయిపోనిస్తూ,

తీవ్రమైన కోపోద్రేకం కలిగింది మధుకు. 'ఆపు నీ దుర్మార్గపునవ్వు.' అంటూ బలము కొద్దీ లాగికొట్టింది అతని చెంపమీద. తన పోషణక్రింద వుండేవాడు ఎదిరించినప్పుడు యజమానికి వచ్చినంతకోపంవచ్చింది అమనుల్లాకు. అప్పుడు వాళ్ళిద్దరకూ ఒక చిన్న ద్వంద్వయుద్ధం జరిగింది.

మధు అమనుల్లాతో ఎదుర్కోవడం కొండతో ఢీకొనడమన్నమాట. ఇనుపగోడవంటి అతని శరీరానికి ఉక్కుగొలుసులవంటి అతని బాహువులచేత ఆమె బంధింపబడింది. చివరకామెను నెట్టేశాడు.మధు క్రిందపడ్డది పాపం. చీరంతా మట్టికొట్టుకుంది- మోచేతికి గాయం తగిలింది.

తిన్నగా సర్దుకుని లేచింది మధు.

'ఇప్పుడు నాక్రూరత్వములో నీ కనుభూతమైంది అణుమాత్రం. నీవు నాకోపకారణమైతివా నీ యెముకలు నులిమివేయగలను. ఇప్పటికైనా నేను చెప్పినట్లు వింటావా? నీవు నాదానివి. నాసొత్తును దక్కించుకునే శక్తి వుంది నాకు. అందుకు ప్రకాశాన్ని చంపవలసివచ్చినా వెనుదీయను.' ఈమాట లంటున్న అమనుల్లాను ముఖంలోకి చూడలేకపోయింది ఆమె.

'ఇంకోసంగతి. నేను శిస్తువసూళ్ళకోసం మాపల్లెటూరు వెళ్ళినప్పుడు హైదరాబాదు నుంచి నీవు నాకు కొన్ని వుత్తరాలు వ్రాశావు; జ్ఞాపకమున్నదా ? నీకు నాపైగల అప్పటి ప్రేమ కళ్లెములుత్రెంపుకుని ప్రవహించింది వాటిల్లో. ఆవుత్తరాలు ప్రకాశంచూస్తే నీగతేమౌతుందో ఊహించుకో.'

'ప్రకాశానికి నాపూర్వచరిత్ర అంతా తెలుసును.'

'అతడు తృప్తిపడ్డా లాభంలేదు. ఈవుత్తరాలవల్ల నీ-నా-సంబంధం బయలుపడ్డప్పుడు ఈ గ్రామంలోవాళ్లు తలకొకమాట అంటారు. ప్రకాశం అందిరినోళ్లా పడతాడు. అంత అవమానానికి వేరువిత్తువైన నిన్ను తప్పకుండా ఏనాటికైనా నిరసిస్తాడు.'

'అట్టిరోజు రాదు. ప్రకాశం ప్రేమలో నాకు విశ్వాసం వున్నది.' అలాగన్నదేకాని మధుహృదయంలో కలతగానే వున్నది. లేడివలె దిక్కులు పారచూస్తూ నిల్చున్నది.

ఒకఫర్లాంగు దూరాన రోడ్డుమీద నడచి వస్తూన్న ప్రకాశం కనుపించాడామెకు.అప్పుడామె త్వరగా అమనుల్లా ప్రక్కకువచ్చి 'అమన్! అదిగో ప్రకాశం ఇటేవస్తున్నాడు; నీవు దబ్బున వెళ్ళిపో' అన్నది.

'సరే, ప్రకాశంతో నాకు రాత్రి ఎనిమిది గంటలవరకూ పనిలేదు. ఆలోపుగా నీవువచ్చి యూరి చివరఉన్న సత్రంలో నన్ను కలుసుకోవాలి. నీవు రాకపోతే నేనేవస్తాను నీకోసం.'

'వెళ్ళిపో దబ్బున'

'నీవురాకపోతే నేనే వస్తాను. తెలిసిందా?'

'వస్తాను; వెళ్లు.'

అమనుల్లా కనబడకుండా వెళ్లిపోయిన కొంతసేపటికి ప్రకాశం వచ్చాడు. మధును చూచి ఒంటరిగా పంపినందుకు చాల నొచ్చుకున్నాడు. ఒక కుక్క తన్ను వెంబడించిరాగా పరుగెత్తుతూంటే రాయితగిలి క్రిందపడ్డానని చెప్పింది మధు.

'అయ్యో, చూడు నీమోచేతి కెంత గాయంతగిలిందో. ఇక ఇంటికిపోదాం. చాల అలసిపోయ్యావు; నాభుజముపట్టుకుని నడు.' అంటూ ప్రకాశ మామెదగ్గరిసా వచ్చాడు.

మధు కెందుకో పొంగిపొంగి వచ్చింది దుఃఖం. ఆమె కన్నీళ్ళతో అతని వక్షోభాగమంతా తడిసింది.

౭

ఇంటికిపోయిన తరువాత మధుకు తగిలిన గాయాలకు వేసేటందుకు మందుకోసం బీరువా తెరిచాడు ప్రకాశం. అందులో ఒక పిస్తోలు కనుపించింది మధుకు. దాన్ని ఆమె తదేక దృష్టితో చూచింది కొంతతడవు. ఆపిస్తోలే ఒకగంట క్రితం తనచేతిలో వున్నట్లయితే !

మధ్యాహ్నం ప్రకాశంతో కలిసి భోజనం చేసిన తరువాత మేడమీది గదిలో ఒంటరిగానే పడుకుంది మధు. నాటిప్రొద్దున అమనుల్లాతో జరిగిన రంగమంతా కన్నులకు కట్టినట్లుగా అగుపించింది. ఆ క్రూరమృగము చేతిలో తా నీవరకనుభవించిన బాధ చాలదూ' ప్రకాశంగృహంలో తన కికముందను భూతము కానున్న సౌఖ్యమునుంచి దూరముగా ఎత్తుకుపోవడానికి మళ్ళీవచ్చాడు.

భయవిహ్వలమైంది ఆమె చిత్తమంతా. అమనుల్లాతో తనకు జరిగిన సంభాషణ ముక్కకు ముక్కా జ్ఞాపకం తెచ్చుకుంది. అతడు తన్ను వదలుకుని వెళ్లుతాడన్నమాట కల్ల.

అయితే ఏంచేయాలి ? ఆమెకు నిస్పృహ కలిగింది. వెంటనే బీరువాలో చూచిన పిస్తోలు జ్ఞాపకానికి వచ్చింది.

ఔను దానితో అతణ్ణి చంపేయాలి. అదే తన స్వేచ్ఛకుమార్గం; అదే తాను ప్రేమించిన వ్యక్తులను కాపాడే విధం.

అయితే, తనసంగతీ ? అట్టి హత్యవలని పర్యవసానం తనకు బాధాకరం కాకుండా వుంటుందా ?

గుండ్రముగా అనంతముగా తిరుగసాగింది ఆమె మనస్సు. భయంకరపథంలో సంచరించుతూన్న ఆలోచనలు '

భూతమూ, వర్తమానమూ ఆమెకన్నుల ముందు చీకటీ, వెలుగూవలె ఒకటి తరువాత ఒకటి తిరుగసాగెను. ఆమె మనోగోచర మయ్యారు : తన ప్రేమ నిధానమైన ప్రకాశమూ—ప్రేమరూపమైన ఆతని తల్లీ—తన తండ్రీ—చివరకు భయంకరరూపంతో అమనుల్లా.

ప్రకాశాన్నీ—అతని తల్లినీ—వాళ్ళయింట్లో సౌఖ్యదేవతనూ కాపాడాలంటే తానను సరింప వలసినది ఒకటేత్రోవ- అది తమసావృతము; భయంకరము-

సాయంత్రపు భోజనమునకు మధును పిల్చుకపోయేటందుకు ప్రకాశం వచ్చినప్పుడామె ప్రశాంతముగనే పడుకుని యుండెను- అప్పుడతన్ని బహుమృదువుగా కౌగలించుకుని ప్రేమచిలుకుతూ అతని కళ్ళల్లోకి చూచింది మధు- తానేదో చేయబోతున్నాననీ, దాని పర్యవసాన మెల్లాగు తేలినా ప్రేమతో తన్ను క్షమించమనీ, ఒక ప్రార్థనా పూర్వకమైన ముక్తసందేశము చెప్పుతున్నవామె నేత్రాలు.

'మధూ' నీముఖ మంతా పాలిపోయింది, డాక్టరును పిలుస్తాను.'

'వద్దు. నాకారోగ్యముగానే యున్నది-' తన చిరునవ్వు పెదవులు అతని నోటిదగ్గరకు తెచ్చింది-

'మా అమ్మ నీస్థితి విని చాలవిచారపడ్డది- నిన్ను చూడ్డానికి మూడుసార్లు వచ్చిందిట- నీవు నిద్రపోతూంటే మళ్ళీ వెళ్ళిపోయిందిట-'

'నేను నిద్రపోతున్నానా- అమ్మను నన్ను క్షమించమనిచెప్పు- ప్రకాశ్, ఈసారి ఒంటరిగా వెళ్ళినప్పుడు జాగ్రత్తగా వుంటాను.'

'సరే, ప్రశాంతంగా పడుకో- నీభోజనము పైకి పంపిస్తాను.'

అతడు వెళ్ళుతూంటే మళ్ళీ పిలవాలనుకుంది మధు. చివరసారిగా ఒక కొంతసేపు అతన్ని తనదగ్గరే వుంచుకోవాలని ఆమె కోరిక- కాని ఎట్టకేలకు ఇప్పుడు టైమెంతవుతుంది అనిమాత్రం పలుకరించింది.

భోజనాలు త్వరగానే ముగిసినవి. అప్పటికే ఏడుగంట లవుతుంది- ఇంకొక్కగంటలో మధుపోయి అమనుల్లాను కలుసుకోవాలి- తప్పదు, తాను ప్రేమించిన యతనికోసం——

మధులేచి కూర్చుని ప్రకాశాని కొక ఉత్తరం వ్రాసింది- 'ప్రియతమా'——నేను చేస్తూన్నపని నాకు విచారకరంగానే వున్నది- అయినా, నే నొకగొప్పతప్పుచేసియున్నాను; నేను నీకు తగిందాన్ని కాను- ప్రకాశ్! నేను మళ్ళీ తిరిగిరాను- నీవు నన్ను క్షమించలేకపోయినా, మరచిపోయన్నా సుఖంగావుండు-
నీ మధు-'

ఆ చిన్న ఉత్తరాన్ని మడిచి తలగడక్రింద పెట్టేసింది. మరునాడుదయం ప్రకాశం దాన్ని చూడగలడు-

కొంతడబ్బూ, అవసరానికి కావలసిన కొన్ని వస్తువులూ ఒకచిన్న సంచీలో పెట్టుకుని బయలుదేరింది మధు- మేడమీదనుంచి క్రిందికిదిగివచ్చి ప్రొద్దున బీరువాలోచూచిన పిస్తోలును వణుకుతూన్న చేతులతో తీసికుని సంచీలో పెట్టేసుకుంది- తలుపుదగ్గర ఆగి ప్రకాశంగదిలోనుంచి మాటలు వినుపిస్తూంటే చెవియొగ్గింది-

'ఔను, అమ్మా! ప్రొద్దుటికంటె కొంచెం కులాసాగానే వుంది. ఈరాత్రి పూర్తిగా నిద్రపట్టుతే రేపు వుదయానికి బాగా తేలిక యిస్తుంది-'

'ఆ అమ్మాయిని గురించి మనం శ్రద్ధ తీసికోవాలిరా- ఆమె మనయింటికి రత్నదీపం వంటిది-'

మధుకు ఒక్కసారిగా కన్నీళ్లు క్రమ్ముకున్నాయి- తలుపుతీసికొని వీధిలోనికి వచ్చేసింది- నిస్పృహతో నిండిపోయిన ఆమె హృదయంలో ఒకటే ఆశాకిరణం వుంది.

ప్రకాశంయెడల ప్రేమా, అమనుల్లా పట్ల అసహ్యమూ——ఆ రెండు భావాలూ సుడిగాలులై ఆమె నా అంధకారములో తీసికుని పోతున్నవి-

అవియే తన జీవితములోని చివర నిముషాలని పూర్తిగా నమ్మిందామె-

. ౮

నాలుగైదు కొవ్వువత్తి దీపాలు వెలిగించుకుని ఆ పాడుబడ్డ సత్రంలో అటూయిటూ పచారుచేస్తున్నాడు అమనుల్లా- తలుపులు తెరచినట్లు చప్పుడైనవి- 'మధు వచ్చినట్లున్నది- రాకేంజేస్తుంది?' అనుకున్నాడు-

కాని మరుక్షణమే అతని ముఖవైఖరి అదోకరకంగా మారిపోయింది- సరిగ్గా తన గుండెకేసి గురిపెట్టి పిస్తోలు చేతపట్టుకుని నిల్చున్నది మధు తలుపోరగా గోడకానుకుని నిల్చుని-

ఆమె కంఠము తొణుకులేకుండా నిర్భయంగా సాగింది: 'అమన్! నేను చెప్పినట్లుగా నీవు వినవలసిన సమయమిది. ఇప్పుడు నేను నీకు రెండుమూడు విషయాలు చెప్పవలసి వున్నది; కూర్చో అక్కడ.'

పిస్తోలుకేసి చూస్తూ వెనుక కొక అడుగువేసి క్రింద కూలబడ్డాడు అమనుల్లా కిక్కురుమనకుండా. అత డామె ఆజ్ఞాబద్ధుడవడ మదే మొదటిసారి.

‘నేను ప్రథమంలో నిన్ను కలుసుకున్నప్పుడు నాకు మతిలేదు. నాక్షేమమైనా ఆలోచించుకునే వివేకం లేకపోయింది. ఆరోజులు—సిగ్గు భిడియములు విడిచి నీతో స్వేచ్ఛగా సంచరించిన యారోజులు తలచుకుంటే నా శరీరంమీద తేళ్లుప్రాకినట్లున్నది. నీవు నన్నొక నరకకూపంలో వుంచావు. అందుండి ఈనాటికి ఉద్ధరింపబడ్డాను ఒక మహత్తరమైన—’

ఉద్రేకపూరితమైంది ఆమెకంఠము. తేజోవంతములైన ఆమె కన్నులు సూటిగా అతని ముఖంలోకి చొచ్చుకు పోతున్నవి.

‘ఔను. ఒక మహత్తరమైన ప్రేమశక్తిచేత. పశువా' నీకు ప్రేమంటే ఏమి తెలుసును? తుచ్ఛవ్యామోహమే నీ ఆకారము.

సరే, జరిగిందేదో జరిగింది. గతమంతా కాలప్రవంతిలో కలసిపోయింది. నేనిప్పుడు వేరేమధును. నన్ను తనసర్వస్వముగా చూచుకునే ఒక పుణ్యపురుషుని నేను ప్రేమిస్తున్నాను. అతని ప్రేమకు పాత్రురాల నయ్యేటందుకు ఎంత సాహసానికైనా వెనుదీయని ధైర్యరూపమైన మధు నీ యెదుటనిల్చున్నది.

అమన్ ! నీవొక మృగానివి. నా—నా ప్రియతముల హృదయాల మధ్య అడ్డుగావున్న ఆవుత్తరాలు నీదగ్గరవున్నవి. అవి నాకిప్పుడు కావాలి. మాయెడల ప్రయోగించడానికి నీకుగల ఆయుధాలవి. వాటిని వెంటనే ఇచ్చివేస్తావా? పిస్తోలు పేల్చనా ?’

అమనుల్లా తన నాలుకతో పెదవులు తడుపుకుంటున్నాడు. పరిస్థితు లిల్లాగు మారిపోతవని అత డనుకోనేలేదు. ‘మధూ, ఏమిటీ అనాలోచితమైన జబర్దస్తీ. నన్నుచంపి నీవు క్షేమంగా పోలేవు. ఉరిత్రాళ్ళకోసన ప్రేలాడుదువు.’

‘ఆవుత్తరాలు నీదగ్గిర వున్నంతకాలమూ నేను బ్రతికి యుండవలసిన అవసరమేమీ కనుపించడము లేదు. అధికప్రసంగము కట్టిపెట్టి ఉత్తరాలు తెచ్చియ్యి.’ అన్నదామె.

‘వాటితో ఏమిచేస్తావు?’

‘తగలపెట్టుతాను.’

‘ఇక్కడే!’

‘ఎక్కడైనా వాటిని మసిచేయగలంత నిప్పువున్నచోట. దబ్బున తీసియ్యి.’

అమనుల్లా ఏమిచేస్తాడు? ఉత్తరాలుఇచ్చేయాలా? లేక పిస్తోలుబారుకు గురికావాలా? ఈవిధమైన పరిస్థితి ఎదుర్కోవలసి యుంటుందేమోనని ముందే ఆలోచించుకోక పోతినని తన్నుతాను నిందించుకున్నాడు. ఎల్లాగైనా పీడైనంతవరకు కాలయాపన చెయ్యాలనుకున్నాడు.

కాని మధు పిస్తోలు నొక్కబోయినప్పుడు అతడు లేవక తప్పిందికాదు. లేచి గోడవద్ద పెట్టె తెరచి అందులోని వుత్తరాలు—ఒక ఎర్ర సిల్కుదారముతో కట్టబడియున్నవి తీసి దూరాన్నుంచే ఆమెముందుకు విసరేడు. పిస్తోలు గురి భంగముకాకుండా అతనికేసి చూస్తూ వంగి ఆ ఉత్తరాల కట్ట అందుకున్నది మధు.

‘అమన్, నీవు కేవలము జంతువవు. నీ దాసివలె చూచావు నన్ను. అదంతా సహించాను నా అవజ్ఞతను నిందించుకుంటూ. కాని ఇప్పుడు సంగతులు మారిపోయినవి. ప్రేమరుచి తెలిసినస్త్రీల సాహసము నీవూహకందనిది. ప్రకాశంయొక్క పవిత్రత నాహృదయంలో ప్రేమజ్యోతిని వెలిగించింది. అతని సౌఖ్యంకోసం నాజీవితం బలియీయవలసివస్తే వెనుకాడను. అతనివద్దకే వెళ్తున్నా నిప్పుడు. వెళ్ళబోయేముందు నీవల్ల ఇంకోపని కావ

లసివున్నది. మరేమీలేదు; కాగితమూ, కలమూ తీసికొని నేనుచెప్పినట్లు వ్రాయి.'

సన్నని కంఠంతో ఈవిధంగా చెప్పింది మధు.

'అమనుల్లానైన నేను మధుపై కొన్ని నిందలారోపింప దలచాను చెడుతలపులు కలిగి. కాని ఆమె ఎప్పుడూ నాప్రేయసికాదు. ఆమె చరిత్రలో కళంకము లనదగిన వేవీ నాకు తెలియవు.'

వ్రాసి చేవ్రాలుచేసి లేచి నిల్చున్నాడు అమనుల్లా. 'ఇదంతా వట్టి అబద్ధాల కుప్పగదా మధూ!' అన్నాడు నవ్వుతూ—

'ఔను. అబద్ధాలే' అన్నది ఆమె— 'కాని అవే నన్ను నీబారినుండి రక్షిస్తవి భవిష్యత్తులో— అవే నాకు ప్రకాశంతో సౌఖ్యజీవనము గడపే అవకాశమిస్తవి— ఇకముందు నే నొక నిండారు ప్రేమజీవితం గడుపదలచాను— దానికి భంగముకలుగకుండేటందుకు నేను చెప్పని అబద్ధమూ, చేయని సాహసమూ ఉండదనుకో—'

వికటంగా నవ్వ సాగించాడు అమనుల్లా— అతని ముఖంలో మార్పు కనుపిస్తున్నది— ఏదో పొరపాటు జరిగిందనుకున్నది మధు— వ్రాసిన కాగితాన్ని ముక్కలు ముక్కలుగా చింపేశాడతడు—

మధుముఖంలో నెత్తురుచుక్క లేకుండా పోయింది. పిస్తోలు కేసిచూచి ఏమిజరిగిందో తెలుసుకున్నది. తనఉద్రేకంలో పిస్తోలు నొక్కేసింది ఎప్పుడో, కాని అది పేలలేదు, అందులో తోటాలులే వసలు.

భయముతో వెనుకడుగులు వేస్తున్నది మధు. అమనుల్లా తరుముకొస్తున్నాడామెను.

'వెనక్కుపో!' అంటూ మళ్ళీమళ్ళీ పిస్తోలు నొక్కింది మధు. కాని అది నిరపాయకరమైన 'క్లిక్, క్లిక్' అనే శబ్దంచేసింది.

'మధూ! లాభంలేదు. ఆయాసపడకు— తప్పించుకునిపోయేదారి లేదు. నీకు— విధికూడా నిన్ను నాకే వప్పజెప్పింది.' అమనుల్లా అన్నాడు—

అతని చేతు లామె నడుముచుట్టూతిరిగెను— అతని పెదవు లామె నోటిదగ్గరకు వచ్చినవి— మూర్ఛలో మునిగినట్లైంది మధుకు.

కాని తక్షణమే అతడామెను వదలేసి వెనక్కుపోయాడు.

మరునిముషమందు మధు ఆశ్చర్యముతో తన పాదములవద్ద అచేతనుడై వున్న అమనుల్లాను చూచింది—

వెంటనే ప్రక్కకుతిరిగింది— తలుపు దగ్గర పొగగ్రక్కుతూన్న రివాల్వరు చేతపట్టుకుని నిల్చున్నాడు గంగాధరనాయుడు— ఒక స్వప్నరంగమువలె వున్న దదంతా మధుకు. తన తండ్రేనా? అతని ముఖంలో పూర్వపు అసంతృప్తి అంతా ఏమైంది? ప్రశాంతంగా వున్నాడు— పుత్రికా వాత్సల్యముతో చూస్తున్నాడు తన్ను.

'మధూ! అంతావిన్నాను— భయపడకు— నాదగ్గరకు వచ్చి వట్టి అబద్ధాలాడటమే అమనుల్లాచేసిన గొప్పతప్పు— అతన్ని నేను అనుసరించే వున్నాను. ఎందుకంటే నీలో పరివర్తన చూడాలనే కాంక్ష నాకెక్కువగా వున్నది— మించిపోయిందిలేదు. మధూ! రా. ఈరాత్రే నీ ప్రకాశందగ్గరకు పోదువుగాని—'

'నాన్నా!'—పిచ్చిగా చూచింది మధు ఆయనకేసి— వాత్సల్యము తొణుకాడే చిరునవ్వు ఆయన పెదవులమీద! తండ్రి కౌగిలిలో తన్నే విస్మరించింది మధు కొంతసేపటివరకూ— ఆ ప్రశాంతనిశీధము మధురముగ నిశ్శబ్దగీతికలు పాడింది.